క్లుప్తంగా

రిలయన్స్ సంస్థకు పురస్కారం



రిలయన్స్ హెచ్ఆర్ ప్రతినిధి సుబ్రహ్మణ్యానికి పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో అందించిన సహకారానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థకు పురస్కారం లభించింది. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ హెచ్ఆర్ ప్రతినిధి పోతాప్రగడ సుబ్రహ్మణ్యంకు కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఈ పురస్కారాన్ని అందజేశారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందనలు



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న ముఖ్య అతిథి మనోహర్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక వివేకానంద పార్కు ఆవరణలోని రాహుల్ తైక్వాండో క్లబ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు పార్కు ఆవరణలో ఆదివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ సాయి మనోహర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. గౌరవ అతిథులుగా తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి బి.అర్జునరావు, కార్యదర్శి మంతెన దుర్గాప్రసాద్, పీఈటీ నూకరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మనోహర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారు చదువులోను చురుకుగా ఉంటారన్నారు. తైక్వాండో కోచ్ సత్యనారాయణను ఆయన అభినందించారు. అనంతరం క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

హద్దుల్లేని అతిక్రమణ

- రహదారిని ఆక్రమించి వ్యాపారాలు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



పెద్దమార్కెట్‌లో రాత్రివేళ ట్రాఫిక్ రద్దీ

బోట్‌క్లబ్: అసలే ఇరుకురోడ్డు.. ఆపై అడ్డంగా వ్యాపారాల విస్తరణ. ఇది చాలదన్నట్టు అతివేగంగా.. అడ్డదిడ్డంగా.. ఆకతాయితనంతో వాహనాలతో దూసుకొచ్చే కుర్రకారు.. ఇవి చాలవూ పాదచారులు, వాహన చోదకుల ఇక్కట్లు అంతా ఇంతా కాదని చెప్పడానికి. అవును మరి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు తిరిగే రోడ్డును ఆక్రమించేస్తూ తమ వ్యాపారాలు చేసుకోవడంతో పలు ప్రాంతాల్లో తిరిగే వారికి నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రయాణించాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించుకుని తమ వ్యాపారాలు అంతకంతకూ స్థాయి పెంచుకుని బాగానే సంపాదిస్తున్నారు. ఇక్కడ వరకూ బాగానే ఉన్నా.. రోడ్డుపైకి తమ వ్యాపార కార్యకలాపాలు సాగించడం వల్లే అను నిత్యం ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు నుంచి పెద్దమార్కెట్‌కు వెళ్లే రహదారి, జ్యోతుల మార్కెట్‌కు వెళ్లే రహదారి, గోల్డ్ మార్కెట్ సెంటర్, తిలక్‌వీధి, దేవాలయంవీధితో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న రహదారులు రెండు పక్కల ఆక్రమించుకొని తమ వ్యాపారాలు చేసుకొంటున్నారు. లోపల షాపు ఉండగానే షాపు ఎదురుగా తమ వ్యాపారానికి సంబంధించిన అనుబంధ వస్తువులు పెట్టి విక్రయిస్తున్నారు. దీంతో అక్కడ కొనుగోలుకు వచ్చే వారు తమ వాహనాలు షాపు ఎదురుగా నిలబెట్టి ఇతరుల రాకపోకలకు అవరోధంగా నిలుస్తున్నారు. ఎప్పుడో పండగలప్పుడైతే పరవాలేదు కానీ, నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎదురవుతుండడంతో కొందరు ఈ ప్రాంతాలు వైపు రావడానికి సైతం హడలిపోతున్నారు. వీలైనంత వరకూ ఈ రద్దీ రహదారుల్లో వెళ్లేందుకు ఇష్టపడక తమ గమ్యస్థానాలకు దూరమైనప్పటికీ వేరే రహదారుల్లో వెళుతున్నారంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

రోడ్డు పక్కనే డ్రైనేజీ ఉండడంతో వాటిని ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకొంటున్న కార్పొరేషన్ అధికారులు ఈ అతిక్రమణ వ్యాపారాలపై ఏమీ హెచ్చరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

చీకటి పడితే నరకయాతనే

చీకటి పడితే పెద్ద మార్కెట్‌లో ఏ రహదారిలోకి వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.



రోడ్డుపై విస్తరించిన వ్యాపారకలాపాలు

ద్విచక్ర వాహనాలపై ఇటుగా వెళ్లాలంటే అర కిలో మీటరు కూడా లేని ఈ రహదారిలో 15 నిమిషాలు పడుతోందంటే ఇక్కడ చీకటి పడితే ట్రాఫిక్ ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. ఇక కార్లపై ఈ రహదారిలో ఎవరైనా తెలియక వస్తే నరక యాతన అనుభవిస్తున్నారు. తెలిసిన వారు ఎవరైనా కారుపై పెద్ద మార్కెట్‌కు వచ్చినా ఎక్కడో దూరంగా కారు పార్కు చేసుకుని ఇక్కడ కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు తప్ప పెద్ద మార్కెట్‌లోకి కారులో వచ్చే సాహసం చేయడం లేదు.

కంటి తుడుపుగా చలానాలు

నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్య వస్తున్నప్పటికీ పోలీసులు సైతం పట్టించుకోవడం లేదు. ఏదో కంటితుడుపు చర్యగా వారితో చలానాలు కట్టించుకుని చేతులు దులుపుకొంటున్నారు తప్పా ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. దీంతో నిత్యం ఈ ప్రాంతంలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మామూళ్లు అందుతుండడం వల్లే పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రతీ రోజు ఇబ్బందే



పెద్ద మార్కెట్‌కు వచ్చామంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం షాపుల ఎదురుగా ఎటువంటి పార్కింగ్ సదుపాయం లేదు. వారి వ్యాపారాలు రోడ్డుపై చేస్తున్నారు. షాపులో చోటు ఉన్న వారు కూడా రోడ్డుపై తమ వస్తువులు విక్రయిస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది.

గొల్లపల్లి శివ

నడిచి వెళ్లేందుకూ ఇబ్బందే



చీకటి పడితే చాలు పెద్దమార్కెట్‌లో నడిచి వెళ్లేందుకు కూడా భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. షాపు యజమానులు కూడా వారి వ్యాపారాలు రోడ్డుపై చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డుపై వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి

ఏలూరి రాణి

పదేపదే తప్పుచేస్తే కేసులు



దుకాణ యజమానులు వ్యాపారాలు చేసుకొనేందుకు ఇప్పటికే వారికి హద్దులు కేటాయించారు. కొందరు వ్యాపారులు వారి హద్దు దాటి రోడ్డుపైకి వస్తే అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం. రెండు, మూడుసార్లు అపరాధం రుసుం విధించిన తర్వాత మళ్లీ అదే తప్పు చేస్తే కేసులు నమోదు చేస్తున్నాం.

నూని రమేష్, ట్రాఫిక్ సీఐ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని నేషనల్ గ్రీన్ కోర్ కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ కోర్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎంఎస్ఎన్ చార్టీస్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 17 పాఠశాలల నుంచి 76 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో ప్రతిభ చూపిన వారికి డిసెంబర్ 3వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు సత్కారం



అన్నదానానికి సహకరించిన ఆలయ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్: స్థానిక అచ్యుతాపురంలోని పైళ్లమ్మ అమ్మవారి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా నెలరోజులు పాటు కోకా వెంకటగిరి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్పదీక్షాధారులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానం ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ సభ్యులను, వంట చేసిన సిబ్బందిని సత్కరించారు.

నిరంతరాయంగా ఓ మోస్తరు వర్షాలు

- పనుల్లేక దినసరి కూలీలకు పస్తులు
- వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు అధికారుల ఆదేశం

కాకినాడ సిటీ: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా కాకినాడ నగరం, రూరల్ నియోజకవర్గాలలో ఆదివారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. రెండు నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ దినసరి కూలీలకు పనుల్లేకుండా ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్లపై వ్యాపారాలు చేసుకునే రైతులు, తోపుడుబళ్ల వ్యాపారాలకు ఇబ్బందులు తప్పలేదు. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇటు కార్పొరేషన్, అటు పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాలతో నగరంలోని లోతట్టు ప్రాంతాల పరిస్థితిని మున్సిపల్, తహసీల్దార్లు పరిశీలించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం దృష్ట్యా అన్ని ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ ఇప్పటికే ఆదేశించారు. రైతులు పంటలను ఒబ్బిడి చేసుకోవాలని, అదే విధంగా మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేశారు.

సాగర తీరాన ఆధ్యాత్మిక శోభ

- ఘనంగా 49వ మహాకుంభాభిషేకం
- 1.08 లక్షల శివలింగాలకు అభిషేకం
- కుంభాభిషేకం రేవు వద్ద పోటెత్తిన భక్తులు



మంగళాంబిక సమేత ఆదికుంభేశ్వరస్వామి



పాదరస లింగానికి మహా కుంభాభిషేకం చేస్తున్న భక్తులు

కాకినాడ రూరల్: కాకినాడ సాగర తీరంలోని కుంభాభిషేకం రేవు భక్త జనసంద్రమైంది. మంగళాంబిక సమేత ఆదికుంభేశ్వరుడికి ఆదివారం భక్తులు విశేషంగా అభిషేకాలు చేశారు. లోక కల్యాణార్ధ ప్రకృతి ప్రమాదాల నుంచి దేశానికి ఉపశమనం కలిగించే శివ కేశవులకు మహాయజ్ఞంగా కాకినాడ సాగర తీరాన శివ భక్తుని సంకల్పంతో కళాబంధు డాక్టరు టి.సుబ్బిరామిరెడ్డి నిర్మించిన శ్రీమంగళాంబిక సమేత ఆదికుంభేశ్వరస్వామి ఆలయంలో 49వ మహాకుంభాభిషేకం ఘనంగా జరిగింది. కోటి ఎనిమిది లక్షల శివ లింగాలతో పాదరస లింగానికి మహా కుంభాభిషేకంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు గోపూజతో ప్రారంభించి విఘ్నేశ్వరపూజ, పంచకాటకం, వేద పఠనం, రసలింగేశ్వరునికి విభూదితో అభిషేకం చేసి అనంతరం అభిషేక విభూదిని సముద్రంలో నిమజ్జనం చేశారు. అభిషేక ద్రవ్యాలతో కోటి ఎనిమిది శివలింగాలకు భక్తుల చేతుల మీదుగా,



ఆలయం వద్ద నిర్వహించిన అన్న సంతర్పణ

పాదరస లింగానికి తోట పుండరీకాక్షులు, శాంతాదేవి దంపతుల చేతుల మీదుగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఆదికుంభేశ్వర లింగానికి బిల్వార్చన, శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం, శ్రీ లలితా దేవికి సహస్ర నామాలతో కుంకుమార్చన, శ్రీమంగళాంబిక సమేత ఆదికుంభేశ్వరస్వామి వారి కళ్యాణం, హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అభిషేక ద్రవ్యాలు, 108 మంది కన్యలతో సాగరంలో నిమజ్జనం చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

సైకత లింగానికి నారికేళ జలాభిషేకం



సైకత లింగం వద్ద సిద్ధం చేసిన నారికేళాలు

కాకినాడ రూరల్: కార్తిక మాసం ముగింపు సందర్భంగా సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం కాకినాడ స్వయం భూ భోగి గణపతిపీఠం ఆధ్వర్యంలో సైకత శివ లింగానికి నారికేళ జలాభిషేకం ఘనంగా నిర్వహించారు. బీచ్‌లోని ఇసుకతో శివలింగాన్ని రూపొందించి అభిషేకం చేశారు. అనంతరం దూసర్లపూడి రమణరాజు లక్ష వత్తులతో హారతి ఇచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన నగర సంకీర్తన



వాకతిప్పలో అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద గత నెల రోజులుగా నిర్వహిస్తున్న నగర సంకీర్తన శనివారంతో ముగిసింది. అదివారం రాత్రి రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్నిగుండం తొక్కారు. శులాల సంబరం నిర్వహించారు. కార్తిక మాసం ప్రారంభం నాటి నుంచి వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, వాకతిప్ప గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం నగర సంకీర్తన నిర్వహించారు. సంకీర్తన ముగింపు సందర్భంగా శివలింగం ఆకారంలో ప్రతిమలు తయారు చేసి గ్రామాల్లో ఊరేగించారు.

భగవద్గీత కంఠస్థ పోటీలకు విశేష స్పందన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని స్థానిక రామారావుపేట, సూర్యారావుపేటలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలకు విశేష స్పందన లభించినట్టు పరిషత్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవిశంకర్ పట్నాయక్ తెలిపారు. భగవద్గీతలోని 11వ అధ్యాయం విశ్వరూప సందర్శనయోగంపై ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 130 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. భగవద్గీత ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంచుకోవచ్చునన్నారు. ప్రఖండ పోటీల్లో విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 8న జగన్నాథపురంలో సైతం ప్రఖండ పోటీలు, 15న స్థానిక రామకృష్ణా పబ్లిక్‌స్కూల్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు త్వరలో తేదీ నిర్ణయిస్తారని, అక్కడి విజేతలకు 2025 జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం సభలో బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ సభకు హిందువు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు ఉదయ భానోజీరావు, శ్రీకృష్ణవాణి, అన్నపూర్ణయ్యశర్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: వీఎస్ లక్ష్మి మహిళా కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం దీర్ఘకాలిక వ్యాధి (ఎయిడ్స్)పై ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య హాజరై వ్యాధికి గల కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్లకార్డులతో విద్యార్థులతో ప్రదర్శన చేయించారు. నివారించు పద్ధతులు, తదితర అంశాలపై వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వై.హారిక, కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్ట భద్రత, రిజర్వేషన్లు కల్పించాలి



మహాత్మా జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

- రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు విఠల్‌కుమార్
- కాకినాడలో కార్తిక వన సమారాధన

కాకినాడ రూరల్: బీసీలకు చట్ట భద్రత కల్పించి, పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు విఠల్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ద్వితీయ కార్తిక వన సమారాధన ఏడీబీ రోడ్డులో నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ఎదురుగా మామిడితోటలో ఆదివారం ఘనంగా జరిగింది. ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షుడు గుత్తుల వీర బ్రహ్మం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు శ్రీరామానుజం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు విఠల్ కుమార్ మాట్లాడుతూ బీసీలు ఐక్యతతో పటిష్టంగా ఉండాలన్నారు. మన హక్కుల కోసం పోరాడాలని, జనగణనతో పాటు కుల గణన చేయాలని ప్రభుత్వానికి వినతి పత్రం అందజేద్దామన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ దంపతులను సన్మానించారు. అనంతరం బీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కలిసి వన భోజనాలు చేసి కాలక్షేపం చేశారు. కార్యక్రమంలో సంఘ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రామ రాఘవ, వర్కింగ్ ప్రెసిడెంట్ అద్దంకి వెంకన్నబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, ఆర్థిక కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు, టౌన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రాజసింహవర్మ, ములంకపాక శ్రీనివాస్, రాపాక శ్రీనివాస్, దొమ్మేటి సుధాకర్, గుత్తుల భీమశంకరరావు, వేండ్ర శ్రీనివాస్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల సమస్యల పరిష్కారానికి కృషి



శెట్టిబలిజ వన సమారాధనలో ఐక్యతను చాటుతున్న సంఘ నాయకులు

- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సన్నాహాలు
- వన సమారాధనలో ఆ వర్గీయుల నిర్ణయం

బోట్‌క్లబ్: రాజకీయాలతో సంబంధం లేకుండా శెట్టిబలిజలకు ఎటువంటి సమస్య వచ్చినా అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఆ వర్గం నాయకులు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం స్థానిక సాంబమూర్తినగర్‌లోని రెవెన్యూ కాలనీలో శెట్టిబలిజ వన సమారాధన నిర్వహించారు. కాకినాడలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో కాకినాడలో నిర్మించే కల్యాణ మండపానికి చొల్లంగి వేణుగోపాల్ తన వంతుగా రూ.లక్ష విరాళం అందిస్తానన్నారు. యు.కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు. కమ్యూనిటీహాల్ నిర్మాణం విషయం కాకినాడ సిటీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లామని సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గెద్దాడ వేంకటేశ్వరరావు, పితాని నూకరాజు, కదలి ఈశ్వరి, గుత్తుల శ్రీనివాస్, నురుకుర్తి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.